క్లుప్తంగా

నగరంలో కలియదిరిగిన కమిషనర్



కాల్వను పరిశీలిస్తున్న నూతన కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగర పాలక సంస్థ నూతన కమిషనర్ మనోజ్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన రోజే నగరమంతా కలియదిరిగారు. స్థానిక కోటిరెడ్డి సర్కిల్ వద్ద కాల్వ పనులు, కోర్టు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకూ చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండులో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలపై వెంటనే అధ్యయనం చేస్తామన్నారు. వై-జంక్షన్ నుంచి అప్సర కూడలి వరకూ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కొండాయపల్లె నుంచి వర్షపు నీరు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర, ఈఈ ధనలక్ష్మి, డీఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

48వ డివిజన్‌పై అధికారుల వివక్ష



హోమియోపతి కళాశాలకు వెళ్లే దారిలో నిలిచిన వర్షం నీరు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని 48వ డివిజన్‌పై నగరపాలక సంస్థ అధికారులు వివక్షత చూపుతున్నారని సీపీఐ నాయకులు మునెయ్య ఆరోపించారు. నగరంలో కురుస్తున్న వర్షాలకు రామరాజుపల్లి హోమియోపతి కేంద్రానికి వెళ్లే దారిపై పూర్తి స్థాయిలో నీరు చేరుతోందన్నారు. గతంలో కాల్వల ద్వారా పులివెందుల రోడ్డు పక్కన గల కేసీ కాల్వకు ఈ నీటిని మళ్లించేవారని, తూములు, కాలువలు కబ్జా చేయడంతో ఈ సమస్య పరిష్కారం కాలేదన్నారు. శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందించి రాజకీయాలకతీతంగా డివిజన్‌లో సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే



కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద స్టిక్కర్లను అతికింపచేస్తున్న సీఐ డి.కె జావీద్

కడప అర్బన్: కడప నగరంలోని ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిందేనని కడప ట్రాఫిక్ సీఐ డి.కె.జావిద్ అన్నారు. కడప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆటోలను నిలిపి నిబంధనలతో కూడిన పోస్టర్లను గురువారం అతికించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహన దారుడు తమ దగ్గర లైసెన్సు, ఆర్‌సీ, కాలుష్య నివారణ సర్టిఫికెట్, తదితర రికార్డులను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. తప్పనిసరిగా హెల్మట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, అతివేగం లాంటి నేరాలకు దూరంగా వుంటే మంచిదన్నారు. కార్లు, ఇతర వాహనాలను నడిపే డ్రైవర్స్ తప్పకుండా సీటు బెల్ట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ



శిక్షణలో తయారీ చేసిన సబ్బును చూపుతున్న మహిళలు

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగరంలోని ఆర్తి ఉమెన్స్ సెంటర్‌లో మహిళలకు ఆర్గానిక్ బాత్ సోప్ మేకింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఆర్తి హోమ్ ప్రెసిడెంట్ పీ.సంధ్య తెలిపారు. ఆమె మాట్లాడుతూ శిక్షణ ద్వారా మహిళలు, బాలికలు స్వయం ఉపాధి పొంది ఆదాయాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్తి హోం సెక్రటరి బి.దుర్గాకుమారి, నాగార్జున డిగ్రీ కాలేజ్, చైతన్య జూనియర్ కాలేజ్, ఆర్తి స్కూల్ బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి దీపోత్సవం

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో పౌర్ణమిని పురష్కరించుకుని గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల మూర్తి, ఉత్సవ మూర్తికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి చౌడేశ్వరీ మాతకు విశేష పూజలను నిర్వహించారు. మహిళలు అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవం నిర్వహించారు.

పేదింటి బిడ్డలు.. ఆటల్లో ధీరులు

క్రీడలపై మక్కువతో ఎంచుకున్న లక్ష్యానికి చేరుకుని తమ సత్తా చాటుతున్నారు. పేదరికం తమకు అడ్డుకాదని.. ఉత్సాహంగా అథ్లెటిక్స్‌లో పాల్గొని ప్రతిభ చూపుతూ జాతీయ స్థాయిలో పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు కడప నగరంలోని విద్యార్థులు. సౌత్ ఇండియా నేషనల్ జూనియర్ మీట్‌కు ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థులు ఎంపికవగా, ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కడప మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని వెన్నెల ఎంపికై అద్భుతంగా రాణిస్తున్నారు.

- పరుగులో రాణిస్తున్న నగర క్రీడాకారులు
- ఇద్దరు క్రీడాకారులకు బంగారు పతకాలు
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో చదువుతున్న ఎం.లోకేశ్వరరావు(ద్వితీయ బీఏ తెలుగు), కె.మహేష్(ద్వితీయ బీబీఏ)లు అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నారు. రాజమండ్రిలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన 37వ ఏపీ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొని వారు పతకాలు సాధించారు. కె. మహేష్, ఎం.లోకేశ్వరరావు, వెన్నెల గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సౌత్ ఇండియా అథ్లెటిక్స్ మీట్-2024కు ఎంపికై సత్తా చాటుతున్నారు. ఆ క్రీడాకారుల ప్రస్థానం ఇలా ఉంది.

మహేష్.. అథ్లెటిక్స్‌లో అదుర్స్



పోరుమామిళ్ల గ్రామానికి చెందిన కె.రవిశంకర్ (బార్బర్), కె.ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు కె.మహేష్ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నారు. చిన్నప్పటి నుంచే ఆటలపై శ్రద్ధ ఉన్న ఈయన ప్రస్తుతం ఆర్ట్స్ కళాశాలలో ద్వితీయ బీబీఏ చదువుతూ జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. 2022లో నిర్వహించిన ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో హైజంప్ విభాగంలో కాంస్యం సాధించారు. అదే ఏడాది యూత్ రూరల్ స్పోర్ట్స్ గేమ్స్ స్టేట్ మీట్ పోటీలలో హైజంప్, యూత్ రూరల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నేషనల్ మీట్‌లో హైజంప్ విభాగాల్లో రాణించి స్వర్ణ పతకం గెలుచుకున్నారు. 2021-22లో ఇండో -నేపాల్ యూత్ రూరల్ గేమ్స్‌లో అండర్-19 విభాగంలో ఆడి హైజంప్‌లోనూ, రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఏపీ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీలలో హైజంప్‌లోనూ రాణించి స్వర్ణ పతకం సాధించారు. ఇది కాకుంఆ డెకాథ్లాన్‌లో రజతం సాధించడంతో ఇతడిని సౌత్ ఇండియా అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికచేశారు.

వెన్నెల.. ఫుట్‌బాల్‌లో భళా



కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బండారు వెన్నెల.. అటు చదువులో.. ఇటు క్రీడల్లో రాణిస్తోంది. బండారు రాజేష్ (మెసెంజర్), దివ్య(అంగన్వాడీ వర్కర్)ల కుమార్తె అయిన బండారు వెన్నెల ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటారు. సెప్టెంబర్ 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పల్నాడులో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో ఏపీ జట్టుకు ఎంపిక చేశారు. కడప జట్టు స్వర్ణపతకం సాధించడంలో కీలకపాత్ర పోషించిన ఆమెను ఈ నెల 19 నుంచి జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికచేశారు. ఫిజికల్ డైరెక్టర్ ఎల్. వెంకటలక్ష్మి, ఫుట్‌బాల్ కోచ్ అమృతరాజ్ సహకారంతోనే తాను రాణిస్తున్నానని వెన్నెల తెలిపారు.

లోకేశ్వరరావు... పరుగు



రైల్వేకోడూరుకు చెందిన లేట్ కె కోనయ్య, ఎం. మేనక (ఆశావర్కర్) కుమారుడైన ఎం.లోకేశ్వరరావు అథ్లెటిక్స్‌లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. నాన్న చనిపోవడంతో.. అమ్మ కష్టం కళ్లతో చూస్తూ పెరిగిన లోకేశ్వరరావు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ద్వితీయ బీఏ తెలుగు చదువుతున్న అతడు ఇన్‌చార్జి పీడీ డా.హజరతయ్య ప్రోత్సాహంతో అథ్లెటిక్స్ క్రీడల వైపు అడుగులు వేశారు. 2023లో జరిగిన 38వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్‌లో, గత ఏడాది జరిగిన సౌత్‌జోన్ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొన్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గుంటూరులో నిర్వహించిన 36వ అథ్లెటిక్స్ మీట్‌లో 800 మీటర్ల పరుగుపందెంలో స్వర్ణ పతకం, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించారు. తాజాగా రాజమండ్రిలో నిర్వహించిన ఏపీ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో 800 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించి సౌత్ ఇండియా నేషనల్స్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక చేశారు.

అంబేడ్కర్ భవనాన్ని పునర్నిర్మించాలి



ఇన్‌ఛార్జ్ జిల్లా కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడప అర్బన్: కడప నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ భవనం పునర్నిర్మాణం చేపట్టాలని ఏపీ మాల మహానాడు జాకట విజయశేఖర్ వర్గం రాయలసీమ అధ్యక్షుడు జేష్టాది భాస్కర్, కడప నగర అధ్యక్షుడు చెంచుల డేవిడ్ సత్యరాజ్ కోరారు. గురువారం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ భవనం ఎస్సీ, సామాజిక వర్గానికి అన్ని విధాలా అందుబాటులో వుండేదన్నారు. భవనాన్ని నూతనంగా నిర్మించి ఎస్సీలకు అందజేస్తే సభలు, సమావేశాలు, శుభకార్యాలను చేసుకునేందుకు అనుకూలంగా వుంటుందని చెప్పారు. స్పందించిన ఇన్‌ఛార్జి కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కానాల క్లైమెంట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పట్ల శ్రద్ధ వహించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపాలని ఎంపీపీ గండి భారతి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రజా సమస్యలను ప్రస్తావించారు. భారీ వర్షాలు కురుస్తున్నాయని, వాగులు, వంకల ఉధృతి వలన ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులంతా నిత్యం అప్రమత్తంగా ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే విద్యుత్, మంచి నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ జ్యోతి మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన సమస్యలను పరిష్కరించాలని, అలా చేయకుంటే సమావేశాలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపిస్తుండగా వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ 25 శాతం సబ్సిడీతో ఇస్తున్న శనగల ధరలు బహిరంగ మార్కెట్ కంటే అధికంగా ఉండటంతో రైతులు తీసుకోవడం లేదని, సబ్సిడీ పెంచేందుకు జిల్లా అధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో చేసిన పనులకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు విద్యుత్ చార్జీలకు జమ చేశారని, అలాగే ఏకగ్రీవ పంచాయతీలకు రావాల్సిన నిధులు కూడా రాలేదని, ఇక ఏడాదిలో తమ పదవీకాలం ముగిసి పోతుందని, తాము ఎలాంటి అభివృద్ధి చేయలేక పోయామని సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

22 నుంచి మొబైల్ ఆధార్ సెంటర్లు

కమలాపురం : మండల పరిధిలోని కోగటం, ఎల్లారెడ్డిపల్లె గ్రామ సచివాలయాలలో ఈనెల 22వ తేదీ నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఆధార్ కేంద్రాలలో 0-5 సం. చిన్నాలకు ఆధార్ అప్‌డేట్ చేయడం, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు చేయడం, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ చేయడం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం తదితర సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

బహిరంగ మద్యపానం చేసే ప్రాంతాలు శుభ్రం



షాదీఖాన వద్ద బహిరంగ మద్యపాన స్థలాన్ని శుభ్రం చేయిస్తున్న పోలీసులు

కమలాపురం : మండలంలో బహిరంగ మద్యపానం సేవించే పలు ప్రదేశాలను గుర్తించి పోలీసులు శుభ్రం చేశారు. గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిల పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది పట్టణ పరిధిలోని షాదీఖాన, రైల్వేస్టేషన్, పుత్తా కాలేజీ, గఫార్ పెట్రోల్ బంక్, కోగటం రోడ్డు, క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాలను శుభ్రం చేశారు. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కమలాపురం పట్టణంలో బహిరంగ మద్యపానం చేసే 14 ప్రాంతాలను గుర్తించామని, వాటిని జేసీబీ, డోజర్ ద్వారా శుభ్రం చేశామన్నారు. ఇకపై ఆ ప్రాంతాల్లో బహిరంగ మద్యపానం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఈ ప్రాంతాలను యువకులు షటిల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలు ఆడుకునే విధంగా సిద్ధం చేస్తామన్నారు.

శుభ్రం చేసిన అనంతరం యువతతో కలసి సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది వాలీబాల్ ఆడారు. పోలీసుల పనితీరు పట్ల పట్టణ ప్రజలు, యువత హర్షం వ్యక్తం చేశారు.

శిక్షణా తరగతులను

స్కూల్ కాంప్లెక్స్‌లో నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: ప్రాథమిక పాఠశాలల్లో 1, 2వ తరగతుల బోధనపై నిర్వహించే ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులను పాఠశాల కాంప్లెక్స్‌లోనే నిర్వహించాలని ఎస్టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడప జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులను అక్టోబర్ 21వ తేదీనుంచి 26వ తేదీ వరకు ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేయునట్లు జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. ఈ రెసిడెన్షియల్ శిక్షణతో ఏకోపాధ్యాయ పాఠశాలలో విద్యార్థులు బోధనకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. మహిళా, అనారోగ్య సమస్యలున్న, చిన్న పిల్లలున్న ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణలో పాల్గొనడం ఇబ్బందిగా ఉందన్నారు. రెసిడెన్షియల్ పద్ధతి రద్దుచేసి స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎస్టీఎఫ్ అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు అంకిరెడ్డిపల్లె లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజగోపాల్ రెడ్డి, కిష్టపర్‌జాన్, ఆలమూరిప్రసాద్, రామమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రవిశంకర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

చక్రాయపేట : గండి క్షేత్రంలోని కోదండ రామాలయంలో గురువారం నూతనంగా ధ్వజ స్తంభ, గణపతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల పూజ, గరుపూజ, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, మహాపూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు రాము శర్మ, నరసప్ప, రాజారమేష్, రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ఈవేడుకలను నిర్వహించినట్లు కోదండ రామాలయ కమిటీ సభ్యులు సాధువిశ్వనాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డిలు తెలిపారు. ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామిగుప్త పాల్గొన్నట్లు వారు తెలిపారు.

బండి కాదు.. మొండి



ట్రాఫిక్ ఆగిపోతే పరుగున వచ్చి వాహనాలను మళ్లించే పోలీసులకు కష్టమే వచ్చింది మరి.. కడప నగరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద మున్సిపల్ ట్రాఫిక్ నియంత్రణ వాహనం కదలకుండా మొండిగా మొరాయించింది. డ్రైవర్ వాహనం స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో సిబ్బంది వాహనాన్ని ఇలా నెట్టాల్సి వచ్చింది.. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా బంధించింది.

సారొచ్చారు.. పేరు మరిచారు





కడప నగరపాలక సంస్థ నూతన కమిషనర్గా మనోజ్ రెడ్డి బాధ్యతలు చేపట్టేందుకు కార్పొరేషన్ కార్యాలయానికి గురువారం వచ్చారు. కార్పొరేషన్ అధికారులు సూచిక బోర్డులో ఆయన పేరు వేయలేదు. దీంతో హడావిడిగా అక్కడికి చేరుకున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ బోర్డు చూపిస్తూ పేరు లేదు.. ఇకనైనా మారండి అంటూ సిబ్బందిని మందలించారు. ఈ దృశ్యాలు సాక్షి కెమెరా బంధించింది.

– రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్

రూ.10 నాణెంపై ప్రజలకు అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

కడప సెవెన్ రోడ్స్ : పది రూపాయల నాణెం మారకంపై ప్రజలలో ఉన్న అపోహలను తొలగించేందుకు గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కరెన్సీ చెస్ట్ కడప బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది స్థానిక రైతు బజారు వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పది రూపాయల నాణేలు చట్టబద్ధమైనవి అని తెలిపారు. ఈ నాణేలను రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని వివరించారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా హైదరాబాదు వారిచే ముద్రించిన కరపత్రాలను కూరగాయల షాపుల వద్ద అతికించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ చెస్ట్ మేనేజర్ శ్రీకాంత్, అధికారి జి. గరుడయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న వరిపంట

చక్రాయపేట : రెండు రోజులుగా పడిన వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాల్లో వరిపంట దెబ్బతింది. మండల వ్యాప్తంగా సుమారు 803 హెక్టార్లలో రైతులు వరి పంట సాగు చేశారు. అయితే వరి నాట్ల సమయంలో వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో రైతులు సాగు చేసిన వరిపంట నేడు వివిధ దశల్లో ఉంది. ప్రస్తుతం కోతకు వచ్చిన పంటతో పాటు వెన్నుదశలో ఉన్న పంట వర్షానికి దెబ్బతిందని అద్దాలమర్రికి చెందిన వేముల సుదాకర్ అనే రైతు వాపోయాడు. ప్రభుత్వం వరి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.



అద్దాలమర్రి వద్ద పడి పోయిన వరిపంట

ఘనంగా వాల్మీకి జయంతి

కడప కల్చరల్: రామాయణ మహా కావ్యాన్ని రచించిన కారణజన్ముడు వాల్మీకి మహర్షి హిందూ పురాణాలకు గుర్తింపు గౌరవం కల్పించారని బీసీ నేతలు కొనియాడారు. బీసీల సంఘం నాయకులు, బీసీ కార్పొరేషన్ అధికారులు గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు.

వైవీయూ: కడప నగరంలోని పలు విద్యా సంస్థల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి వాల్మీకీ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకాలు అని పేర్కొన్నారు. ప్రపంచంలో నదులు, పర్వతాలు ఉన్నంత కాలం రామాయణం చదువుతారన్నారు.

ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ వాల్మీకి జీవితం ఎంతో విలక్షణమైనదని వివరిస్తూ ముఖ్యమైన విషయాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో హ్యుమానిటీస్ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య చంద్రఓబుల రెడ్డి, ఆచార్య వి. రామకృష్ణ, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో వాల్మీకి జయంతి

ఆర్ట్స్ కళాశాలలో..

ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, తెలుగు శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి.. అనంతరం వాల్మీకి రామాయణం రాసే వరకు జరిగిన ఆయన పరిణామక్రమాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అంకాల్ నాగరాజు, పి.శివరామకృష్ణ, లీలావర్ధిని, తెలుగుశాఖ విభాగాధిపతి డా. సుందరేశ్వరరావు, పి. నాగరాజు, డా.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డా. వి. సలీంబాషా

మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాల్మీకీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా మాట్లాడుతూ దొంగ నుంచి మహర్షిగా మారిన పరివర్తనను వివరించారు.డా.పి.గురువిరెడ్డి, డా. గురుమోహన్ రెడ్డి, డా. వీరభద్రయ్య, వెంకటసుబ్బారెడ్డి, వీరయ్య, నాగవేణి, రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదికవి వాల్మీకి జీవితం విలక్షణమైనది

కడప ఎడ్యుకేషన్: ఆదికవి వాల్మీకి జీవితం ఎంతో విలక్షణమైనదని, తన జీవితకాలంలో పాప పుణ్య కర్మలపై ప్రక్షాళన ప్రచారం చేశాడని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా కడప కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాల లేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని భారతీయులు ప్రామాణికంగా తీసుకుంటారన్నారు.



వైవీయూలో జరిగిన కార్యక్రమంలో వీసీ, ప్రిన్సిపల్, తదితరులు



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు